క్లుప్తంగా

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై నాగులమీరా

చింతకాని: మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామంలో ఖమ్మం–బోనకల్ ప్రధాన రహదారిపై ఎస్సై షేక్ నాగులమీరా బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎన్నికల ప్రవర్తన నియమావళిలో భాగంగా వాహనాల తనిఖీని చేపడుతున్నట్లు తెలిపారు. వాహనాలతో పాటు బెల్టు షాపులను కూడా తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో పోలీసు కానిస్టేబుల్ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

పరిశ్రమ ఎదుట ఆందోళన

ముదిగొండ: ముదిగొండ పారిశ్రామిక ప్రాంతంలో మిరపకాయల నుంచి ఆయిల్ తీసే పరిశ్రమ ఎదుట కార్మికులు బుధవారం ధర్నా చేపట్టారు. పరిశ్రమలో పనిచేసిన తమని మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమను కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వ్యక్తులను తీసుకొచ్చి పరిశ్రమ నడిపించడం సరికాదన్నారు.

వైరాలో ఫిషరీస్ కళాశాల ఏర్పాటు చేయాలి

వైరా: వైరా నియోజకవర్గ కేంద్రంలో వ్యవసాయ అనుబంధ ఫిషరీస్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ వైరా నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు పుప్పాల నాగరాజు, కోట ప్రేమ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక సందర్భంగా మాధవ తీర్థాలను బుధవారం స్థానిక బోడేపూడి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైరాలో ఇంటర్ తర్వాత ఉన్నత విద్య చదవాలంటే విద్యార్థులకు ప్రభుత్వ విద్య అందుబాటులో లేకుండా పోయిందని నిర్లిప్తత చెందారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఏమారి అజయ్, హేమంత్,జశ్వంత్, సంతోష్,చరణ్, గోపి, పాల్గొన్నారు.

పేదలకు చీరలు పంపిణీ

కారేపల్లి: రంజాన్ మాసం సందర్భంగా.. కారేపల్లి జామే మసీదు కమిటీ మాజీ అధ్యక్షుడు షేక్.గౌసుద్దీన్ కారేపల్లిలోని భారత్‌నగర్ కాలనీ పేదమహిళలకు బుధవారం చీరలను అందించారు. ఈ సందర్భంగా గౌసుద్దీన్ మాట్లాడుతూ.. పేదలకు సహాయం చేయటం వలన అల్లా దీవెనలు పొందుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సోమయ్య, నాగరాజు తదితరులు ఉన్నారు.

సబ్ కోర్టు కార్యకలాపాలను ప్రారంభించాలి



న్యాయమూర్తి జగ్జీవన్ కుమార్‌ను కలిసిన మధిర న్యాయవాదులు

మధిర: మధిరలో సబ్ కోర్టు కార్యకలాపాలను త్వరితగతిన ప్రారంభించాలని జిల్లా న్యాయమూర్తి జగ్జీవన్ కుమార్‌కు న్యాయవాదులు విజ్ఞప్తి చేశారు. మధిర బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోజెడ్ల పుల్లారావు ఆధ్వర్యంలో న్యాయవాదులు బుధవారం ఖమ్మంలో జిల్లా న్యాయమూర్తిని కలిసి సమస్యను వివరించారు. మధిరకు సబ్ కోర్టు మంజూరైనప్పటికీ కార్యకలాపాలను ప్రారంభించకపోవడంతో కక్షిదారులు, న్యాయవాదులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు సుంకు మోహన్ దాస్, వాసిరెడ్డి కోటేశ్వరరావు, దిరిశాల జగన్మోహన్ రావు, సుబ్రహ్మణ్యం, గోపాల్, పూర్ణచంద్రరావు, రామరాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ముదిగొండ: విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపడుతున్నందున న్యూలక్ష్మీపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పారిశ్రామిక ప్రాంత ఫీడర్‌లో గురువారం ఉదయం 7.30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ముదిగొండ విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పాఠశాలకు బీరువా అందజేత

వేంసూరు: మండలంలోని కందుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాల 2022–23 పూర్వ విద్యార్థులు తమ మిత్రుడు నక్కా రాజేష్ జ్ఞాపకార్థం రూ.10వేల విలువగల బీరువాను వితరణగా అందించారు. అనంతరం 6 నుంచి 9వ తరగతి వరకు ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బొంతు శ్రీనివాసరావు, వేంసూరు హెచ్ఎం సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూతలేక.. కాత రాక

- మామిడి దిగుబడిపై దిగులు
- వాతావరణ మార్పులతో కనిపించని పూత
- ఆందోళనలో రైతులు



తల్లాడలో ఓ రైతుకు చెందిన మామిడి తోట

తల్లాడ: పండ్లలో రారాజు మామిడి. వేసవికాలం వచ్చిందంటే మామిడికి ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది. మామిడి కాయలు సీజన్‌లో తయారై నోరూరించే విధంగా ఉంటాయి. అంతేకాకుండా ఇక ముఖ్యంగా ఆవకాయ పచ్చడి పెట్టేందుకు ఉత్సాహం చూపిస్తుంటారు. అలాంటి మామిడి సీజన్ ఈ ఏడాది ఆలస్యమౌతుంది. ఇందుకు కారణం వర్షాభావ పరిస్థితులేనని ఉద్యానవన శాఖాధికారులు, రైతులు అంటున్నారు. సహజంగా మార్చి నెలాఖరు నాటికి మామిడి తోటలు కాయలతో కళకళలాడుతుంటాయి. ఈ పాటికే మామిడి తోటలు విరగ కాయాల్సి ఉండగా ఈ ఏడాది ఇంకా కొన్నితోటల్లో పూతకూడా నిల్వటం లేదు. దీంతో 50శాతం మామిడి తోటల్లో ఈ ఏడాది దిగుబడి అంతంత మాత్రంగానే ఉంటుంది.

జనవరిలో పూయాల్సిన పూత మార్చిలో..

యేటా సాధారణంగా మామిడి పూత నవంబర్, డిసెంబర్‌లో మొదలై జనవరి నెలాఖరుకు పిందెలు వస్తాయి. కానీ ఈ ఏడాది జనవరిలో పూయాల్సిన పూత మార్చిలో పూస్తుంది. అదికూడా ఎన్ని మందులు స్ప్రే చేసినా నిల్వటం లేదు. జనవరి, ఫిబ్రవరితో పాటుగా మార్చి నెలలో పూసిన పూత కూడా రాలిపోయింది. అయితే పూత నిలవడం కోసం రైతులు ఇప్పటికే ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు 8నుంచి 10 సార్లు వివిధ రకాల మందులు స్ప్రే చేశారు. ఒక్కో ట్యాంక్‌కు రూ.20 వేలు వరకు వెచ్చించి మందులు స్ప్రే చేశారు. తేమ శాతం లేకనే ఇలా పూత రాలుతుందని రైతులు పేర్కొన్నారు.

జిల్లాలో 32వేల ఎకరాల్లో మామిడి తోటలు..

ఖమ్మం జిల్లాలో 32వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. వీటిలో ముదురు, లేత తోటలు ఉన్నాయి. చిన్న రసాలు, బంగినపల్లి, తోతాపురి, పెద్ద రసాలు, ముంత మామిడి, హిమామ్ పసంద్, జాంగిరి, మల్లిక వంటి మామిడి రకాలను సాగు చేస్తున్నారు. సత్తుపల్లి డివిజన్ మామిడి పంటకు ప్రసిద్ధి. సత్తుపల్లి డివిజన్‌లో 18వేల ఎకరాలు మామిడి తోటలున్నాయి.

కౌలు రైతుల పరిస్థితి దయనీయం..

మామిడి తోటలను ఈ ప్రాంతంలో కౌలు రైతులే ఎక్కువగా పంటను కోసి విక్రయిస్తుంటారు. తల్లాడ మండలంలోని కుర్నవల్లి, రంగంబంజర, రామానుజవరం, లక్ష్మీపురం, బస్వాపురం, మల్సూర్‌తండా, గాంధీనగర్‌తండా, రేజర్ల, బిల్లుపాడు, వెంగన్నపేట, ముద్దునూరు, రంగాపురం, కలకొడిమ, పినపాక, తల్లాడ, గంధీనగర్‌తండా, అన్నారుగూడెం, గోపాలపేట గ్రామాల్లో మామిడి తోటలున్నాయి. ఈ తోటలను అసలు రైతుల నుంచి కౌలు రైతులు ముందుగానే జనవరిలోనే మాట్లాడుకొని వాటిని పోషణ చేస్తుంటారు.

డిసెంబర్, జనవరి నెలల్లో వచ్చిన పూతే నిలుస్తుంది



ఈ ఏడాది పూత నిలవకుండా మామిడితోటల్లో బాగా రాలి పోయింది. డిసెంబర్, జనవరి నెలలో వచ్చిన పూత మాత్రమే నిలుస్తుంది. ఇప్పుడు మార్చి నెలలో పూత వచ్చినప్పటికీ అది ఎక్కువగా నిల్వదు. నిలిచినా కాయలో పెరుగుదల ఉండదు. పూత పింద నిలిచేందుకు మామిడి తోటలకు ప్లానా ఫిక్స్ మందు స్ప్రే చేయాలి. వర్షాభావ పరిస్థితులు వల్ల పూత నిలవడంలేదు.

– బీవీ రమణ, జిల్లా ఉద్యానశాఖాధికారి, ఖమ్మం

పూత నిలవడం లేదు



ఎన్ని మందులు స్ప్రే చేసినా మామిడితోటలో పూత నిలవటం లేదు. ఇప్పటికే మందులు ఎనిమిది సార్లు స్ప్రే చేశాను. అయినా పూత నిలవడం లేదు. జనవరి నుంచి మార్చి నెల వరకు పూత నిలవటానికి ఎన్ని సార్లు మందులు కొట్టిన ఉపయోగం లేదు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు మామిడి రైతులపై కూడా పడ్డాయి. మునుపెన్నడూ లేని విధంగా ఈ ఏడాది మామిడి రైతులకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది.

– మూడ్ లచ్చిరాం, కౌలు రైతు, గాంధీనగర్‌తండా

మామిడి రైతులకు నష్టమే..



మామిడి రైతులకు ఈ ఏడాది నష్టమే చేకూరుతుంది. వర్షాభావం వల్ల మామిడిలో పూత సరిగా నిలవక దిగుబడి అంతంత మాత్రంగానే ఉంటుంది. మార్చి నెల వచ్చినా ఇంకా పూత, పిందె మీదనే తోటలున్నాయి. ఈ పూత కూడా నిలిచే అవకాశం లేదు. దీంతో ఈ సంవత్సరం కూడా మామిడి రైతులకు నష్టాలే. మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

– తూము శ్రీనివాసరావు, రైతు, నూతనకల్

మద్దతు ధరకే ధాన్యం కొనుగోళ్లు



పెసర పంటను పరిశీలిస్తున్న వైరా ఏడీఏ కరుణ

కొణిజర్ల: యాసంగిలో రైతులు సాగుచేసిన వరి పంటను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని వైరా ఏడీఏ కరుణశ్రీ అన్నారు. బుధవారం ఆమె వైరా, కొణిజర్ల ఏఈలు పవన్‌కుమార్, బాలాజీలతో కలిసి కొణిజర్ల మండలం అమ్మపాలెంలో వరి, పెసర పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏ గ్రేడ్ రకానికి రూ.2,203 ధరను, సాధారణ రకానికి రూ.2,183 ధను ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. పీఏసీఎస్ కొణిజర్ల, డీసీఎంఎస్ ఖమ్మం వారి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రైతులు ధాన్యాన్ని తూర్పారబట్టి మట్టి పెడ్డలు, రాళ్లు లేకుండా శుభ్రమైన రకాలు కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాసరాజు రైతులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు నివేదిక పంపాం



ధరణి ద్వారా మంజూరు చేసిన పాస్ పుస్తకాలు

కల్లూరురూరల్: మండలంలోని పాయపూర్ పెద్దచెరువు ముంపు ప్రాంతంలో 10 మంది వ్యక్తుల అక్రమంగా ధరణిలో నమోదైన పాస్‌పుస్తకాలు పొందిన విషయంపై రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారుల ద్వారా రూపొందించిన ప్రాథమిక నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. పాయాపూర్ పెద్దచెరువులో 242 సర్వే నంబర్‌లో ఉన్న మొత్తం 51.7 ఎకరాల ముంపు భూమిని 2016–17వ సంవత్సరంలో అప్పటి తహసీల్దార్ ధరణిలో నమోదు చేసి డిజిటల్ పాస్ పుస్తకాలు మంజూరు చేశారు. ఆనాటి నుంచి ఇప్పటి వరకు అక్రమార్కులు రైతుబంధు, బ్యాంకు రుణాలు, వ్యవసాయ రుణాలు పొందారు. ఈ విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తెచ్చిన అనంతరం అధికారులు ఆగమేఘాలపై పాయాపూర్ పెద్దచెరువును సర్వే చేశారు. గత శనివారం రెవెన్యూశాఖ అధికారులు సర్వే నిర్వహించగా, రెండోసారి జలవనరుల శాఖ అధికారులు సర్వే నిర్వహించారు. ఈక్రమంలో 51 ఎకరాలు చెరువు ముంపు ప్రాంతం కబ్జాకు గురైందని తేలింది. ఈ నివేదికను అధికారులు కలెక్టర్‌కు బుధవారం అందించారు.

అక్రమ పాసు పుస్తకాలపై కొనసాగుతున్న విచారణ..

అక్రమ పాసు పుస్తకాలు ఏ విధంగా మంజూరు చేశారనే విషయంపై రెవెన్యూశాఖ అధికారులు విచారణ చేయనున్నారు. జిల్లా కలెక్టర్‌కు ప్రాథమిక నివేదిక పంపించిన అనంతరం వచ్చే ఆదేశాలకు అనుగుణంగా అక్రమ పాస్‌పుస్తకాల మంజూరు విషయంపై విచారణ చేసేందుకు అధికారులు సమయత్తమౌతున్నారు. దీంతో ఇప్పటి వరకు ఎంత మేరకు రైతుబంధు మంజూరు అయింది. ఏ ఏ బ్యాంకుల్లో రుణాలు పొందారు. తదితర విషయాలు విచారణలో వెలుగులోకి రానున్నాయి.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రొఫెసర్ కల్యాణి

కొణిజర్ల: విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో రాణించాలని జేఎన్‌టీయూ హైదరాబాద్ ఎడ్యుకేషనల్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్. తారా కల్యాణి అన్నారు. మండలంలోని తనికెళ్లలో గల విజయ ఇంజనీరింగ్ కళాశాల, ట్రిపుల్ ఈ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి టెక్నికల్, కల్చరల్ ఫెస్ట్ ఆదిత్యా 2024ను ఆమె బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి జాతీయస్థాయి ఫెస్ట్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ఘంటా రమేష్, కళాశాల చైర్మన్ పాయల్లపల్లి ఉపేందర్‌కుమార్ మాట్లాడారు. విద్యార్థులకు పలు సంస్థల యాజమాన్యాలు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకుంది. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జగన్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పాపయ్య, ఫ్రెడ్డి విజయలక్ష్మి, ఇన్ఫోసిస్ ప్రతినిధి నివాస్, టాస్క్ టీఆర్ఎం దినేష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.చిన్నయ్య, డీన్ డాక్టర్ శ్రీనివాసరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఆయేషా తరుణమ్ తదితరులు పాల్గొన్నారు.

గులాబీ జెండా ఎగరడం ఖాయం



మాట్లాడుతున్న పార్లమెంట్ సభ్యుడు నామా నాగేశ్వరరావు

బోనకల్: ఖమ్మం జిల్లాపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని జానకీపురం గ్రామంలో బుధవారం బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ విస్తృతస్థాయి కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ తాతా మధు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, జెడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్ పాల్గొని ప్రసంగించారు. కార్యకర్తలు కసితో పనిచేయాలన్నారు. ప్రజల సహకారంతో రెండుసార్లు గెలిచానని.. మూడోసారి కూడా గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, మాజీ డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బండం శ్రీను, బేబీపాలు మల్లికా ర్జున్, బానోత్ కొండ, బండం నాగేశ్వరరావు, తన్నీరు రవి, గద్దల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలో నీటి కష్టాలు ..

తల్లాడ: తెలంగాణా రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో నీటి కష్టాలు మొదలయ్యాయని బీఆర్ఎస్ ఖమ్మం నియోజక వర్గ పార్లమెంట్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు అన్నారు. తల్లాడలో బుధవారం నామా గెలుపును కాంక్షిస్తూ జరిగిన సన్నాహక సమావేశంలో ఆయనతో పాటుగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడారు. బీఆర్ఎస్ విజయం కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. కాంగ్రెస్ పట్ల ప్రజల్లో విముఖత వ్యక్తమవుతుందన్నారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఎంపీపీ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ ప్రమీల, దొడ్డ సూర్యం, వీరమోహన్‌రెడ్డి, దండపత్‌రావు, వెంకటలాల్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

వేంసూరు: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామ మాజీసర్పంచ్ గుడిశాల రమేష్‌ను ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు నామా నాగేశ్వరరావు బుధవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పర్సగాని తిరుపతి కిషోర్, వైస్ ఎంపీపీ గురిజాల హనుమంతరావు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొని వెంకటేశ్వర్లు, వీరభద్రం, తన్నీరు రవి, బీకట రాంబాబు, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తా మృతికి మంత్రి తుమ్మల నివాళి



గుత్తా భౌతిక కాయం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి తుమ్మల

వేంసూరు: సీనియర్ నాయకుడు లచ్చన్నగూడెం మాజీ సర్పంచ్ గుత్తా వెంకటేశ్వరరావు (67) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం లచ్చన్నగూడెంలోని ఆయన నివాసంలో కన్నుమూశారు. మంత్రి తుమ్మలకు ప్రధాన అనుచరుడిగా మెలిగారు. విషయం తెలుసుకున్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెంకటేశ్వరరావు, అశ్వారావుపేట మాజీ శాసనసభ్యుడు మెచ్చా నాగేశ్వరరావు భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలువురు బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

మధిర: మధిర మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ కార్మికులకు బిస్కెట్లు, పండ్లు, ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, తాగునీటి సరఫరా కార్మికులకు మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ షుకీ అల్లా ఆధ్వర్యంలో డాక్టర్ మనోజ్, మున్సిపల్ ఇంజినీర్ నరేష్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు.

బీటెక్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లిరూరల్: బీటెక్ రెండో సంవత్సరం ఫైనల్ ఫలితాల్లో గంగారం సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శేషారత్నకుమారి తెలిపారు. ట్రిపులీఈ విభాగంలో యాస్మిన్ షా, కె.గోపీచంద్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో మోరంపూడి హేమంత్, ఈసీఈలో మానికల సాయికిరణ్, తొర్లపాటి రమ్య, తడికమళ్ల పుష్పలత, గరిడేపల్లి సాయిసునంద, వర్షిణి, సమీర, తేజశ్రీ, మైథిలి, శివగ్యాన్ ప్రతిభ చూపినట్లు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను రాజ్యసభ సభ్యుడు, కళాశాల చైర్మన్ బండి పార్థసారధిరెడ్డి, ట్రస్ట్ బండి అన్నిరెడ్డి వద్దిరాజుగా అభినందించారు. అదే విధంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ శేషారత్నకుమారి, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, విభాగాధిపతులు అభినందనలు తెలిపారు.

గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

మధిర: మధిర పట్టణంలోని సెయింట్ ఫ్రాన్సిస్, శ్రీ చైతన్య పాఠశాలల్లో బుధవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. సెయింట్ ఫ్రాన్సిస్ పాఠశాల ప్రిన్సిపాల్ సునీజాకొ, అర్‌సీఎం చర్చి ఫాదర్ కాంతికుమార్, అకడమిక్ కోఆర్డినేటర్ వెంకటనారాయణ ఆధ్వర్యంలో శ్రీ చైతన్య పాఠశాలల్లో ప్రిన్సిపాల్ ఆశ్లేభారతి చేతుల మీదుగా విద్యార్థులకు మెడల్స్, పట్టాలు పంపిణీ చేశారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మూడోసారి మోదీని పీఎం చేద్దాం



మాట్లాడుతున్న వినోద్ రావు

వైరా: మూడోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వమే ఏర్పడటం ఖాయమని ఖమ్మం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు అన్నారు. వైరాలోని పరుచూరి గార్డెన్స్‌లో బుధవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం ఆయన మాట్లాడారు. తాను ఖమ్మం జిల్లా బిడ్డనని, ఖమ్మంలో సమస్యలు తెలిసిన వాడినని, కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపిస్తే ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తెలుగుదేశం, జనసేన, ఎమ్మార్పీఎస్ ఇతర కుల సంఘాల నాయకులను కలుపుకుని కార్యకర్తలు ప్రచారంలో దూసుకు పోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, భూక్యా శ్యాంరాథోడ్, నున్నా రవి, నంబూరి రామలింగేశ్వరరావు, నెల్లూరి కోటేశ్వరరావు, కోపూరి నాగేశ్వరరావు, చిలుకూరి రమేష్, దావా కిరణ్, రవి రాథోడ్, బండారు నరేష్, ఏపూరి నాగేశ్వరరావు, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

డీఏలు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న వెంకిరెడ్డి

సత్తుపల్లిటౌన్: ఇప్పటికే నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని.. పీఆర్సీ గడువు కూడా సమీపిస్తుంది. కనుక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే డీఏలు మంజూరు చేయాలని విశ్రాంత ఉద్యోగులు కోరుతున్నారు. బుధవారం పట్టణంలోని జవహర్ నగర్‌లో గల సంఘ కార్యాలయ భవనంలో.. కేశవరెడ్డి అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంఘం అసోసియేట్ అధ్యక్షుడు వి.వెంకిరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ కమిషన్ అనుమతితో డీఏలు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మార్చి నెల నుంచి ఉద్యోగ విరమణలు ప్రారంభమయ్యాయని, రిటైర్డ్ అయిన వారికి రావాల్సిన బకాయిలు తక్షణమే అందించాలని కోరారు. ఈ సమావేశంలో సత్తుపల్లి యూనిట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేశవరెడ్డి, బద్రుద్దీన్‌లతో పాటు సంఘ నాయకులు ఎస్ ప్రభాకర్‌రావు, బూరం దాసు, సాంబశివరెడ్డి, వాణి, కమలకుమారి, మదుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తోఫా కిట్ అందజేత

ముదిగొండ: ముస్లిం ఐక్య సంఘం సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో ముదిగొండలో ముస్లింలకు రంజాన్ ఈదా తోఫా కిట్లను బుధవారం పంపిణీ చేశారు. మూడువందల ముస్లిం మహిళలకు కిట్లు అందించారు. ఈ కార్యక్రమంలో మదిర నియోజకవర్గ అధ్యక్షుడు మౌలానా, షేక్ ముజాహిద్, ఉపాధ్యక్షుడు షేక్ హుస్సేన్, కోశాధికారి గౌసుద్దీన్, మండలాధ్యక్షుడు మైబు, కార్యదర్శి తాజు, సంయుక్తకార్యదర్శి నయ్యుద్దీన్, కోశాధికారి ఖాసి, సభ్యుడు జానీపాషా పాల్గొన్నారు.

ఏకంగా ఏడు ఉద్యోగాలు



ఉదయ్ హాసన్

మధిరరూరల్: మధిర మండలం మాటూరు గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థి రాయబారపు ఉదయ్ హాసన్ ఏకంగా ఏడు కొలువులు సాధించాడు. ఉదయ్ హాసన్ తండ్రి నాగేశ్వరరావు (ప్రైవేట్ టీచర్), తల్లి సృజనకుమారి (గృహిణి), చెల్లెలు హర్షప్రియ (బీటెక్ ఫైనలియర్) ఉన్నారు. బాసరలో ట్రిపుల్ ఐటీ 2022 సంవత్సరంలో పూర్తి చేసిన హాసన్ బ్యాంక్ కోచింగ్‌కోసం హైదరాబాద్ వెళ్లాడు. పట్టుదలతో చదివి 2024లో ఆర్ఆర్‌బీలో క్లర్క్, పీఓగా ఎంపిక కాగా.. ఎస్‌బీఐలో పీఓ, ఆర్‌బీఐ అసిస్టెంట్ పోస్టును, ఐబీపీఎస్‌లో క్లర్క్‌గా, కెనరా బ్యాంక్‌లో పీఓ పోస్టులకు ఎంపికయ్యాడు. ప్రస్తుతం న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించి జాయిన్ అయ్యాడు. పూణేలో శిక్షణను పూర్తి చేసుకొని వైజాగ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ సందర్భంగా ఉదయ్ హాసన్ 'సాక్షి'తో మాట్లాడుతూ.. నా పేరెంట్స్ లాగా నేను కష్టపడకూడదని నన్ను మంచిగా చదివించారు. పట్టుదలతో చదివి కోచింగ్ తీసుకొని ఉద్యోగ పేటలో పడ్డాను. అన్నింటికీ దరఖాస్తు చేసి ఏడు ఉద్యోగాలను సాధించాను. ప్రస్తుతం వైజాగ్‌లో ఎన్ఐసీఎల్‌లో జాబ్ చేస్తున్నాను. భవిష్యత్‌లో ఆర్బీఐలో గ్రేడ్ బీ ఉద్యోగం సాధించాలని కోరిక ఉంది.

ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ ఎన్నిక



ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు చిన్న కేశవ, అశోక్

మధిర: ఎస్ఎఫ్ఐ మధిర డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మధిర పట్టణంలోని శ్రీనిధి జూనియర్ కళాశాలలో బుధవారం ఎస్ఎఫ్ఐ డివిజన్ మహాసభలు బోడ వెంకట్ అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా యూనియన్ డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.చిన్న కేశవ, కార్యదర్శిగా మందా అశోక్‌తో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. ఈ మహాసభల్లో ఎస్ఎఫ్ఐ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పాసంగులపాటి సుధాకర్ పాల్గొని మాట్లాడారు. ఈ నెల 5న జరిగే ఎస్ఎఫ్ఐ ఖమ్మం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. విద్య కార్పొరేటీకరణ, కాషాయీకరణను వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలని కోరారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ పోరాటాలు చేస్తుందన్నారు. పలు తీర్మానాలను మహాసభ ఆమోదించింది. యూనియన్ ఉపాధ్యక్షుడిగా వీరేందర్, బోడ వెంకట్, శ్రీనివాస్, కోట

చైతన్య, కార్తిక్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా గోపి, సుధీర్, నాగ మురళిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర నాయకులు మందా సైదులు, మధు, మురళి తదితరులు పాల్గొన్నారు.

టైలర్స్ యూనియన్ అధ్యక్షుడిగా ఉమామహేశ్వరరావు



ఉమామహేశ్వరరావును సన్మానిస్తున్న టైలర్స్ యూనియన్ బాధ్యులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి పట్టణ టైలర్స్ యూనియన్ అధ్యక్షుడిగా పి.ఉమామహేశ్వరరావు(నత్త) ఎన్నికయ్యారు. సత్తుపల్లి కళాభారతిలో బుధవారం జరిగిన టైలర్స్ యూనియన్ ఎన్నికల్లో ఉమామహేశ్వరరావుకు 196 ఓట్లు రాగా.. డీఎన్ చారికి 86 ఓట్లు వచ్చాయి. 105 ఓట్ల మెజార్టీతో ఉమామహేశ్వరరావు విజయం సాధించారు. అనంతరం ఆయనను టైలర్స్ యూనియన్ బాధ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ రావు, రంగారావు, లాల్‌ఖాన్, కోటా సత్యనారాయణ, వీరివాడ భూషణం, రంగపూరి వెంకటేశ్వరరావు, ఎండీ ఖాన్ పాల్గొన్నారు.

పనిప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలి



ఉపాధి కూలీలతో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

కారేపల్లి: ఉపాధిహామీ పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల సహాయ కార్యదర్శి దాసరి మల్లయ్య, మాజీ సర్పంచ్ బానోత్ బన్సీలాల్ తెలిపారు. బుధవారం మండలంలోని ఉసిరికాయలపల్లి గ్రామంలో ఉపాధిహామీ పనిప్రదేశాన్ని వ్యవసాయ కార్మిక సంఘం బృందం పర్యటించి కూలీల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని పనిప్రదేశంలో టెంట్లు ఏర్పాటు చేయాలని, మంచి నీటి సౌకర్యం, ఓఆర్ఎస్ పాకెట్స్, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాసరి పెద్దులు, పచ్చిపాల నరసయ్య, బానోత్ శంకర్, జ్యోతి, సరోజిని, వీరలాల్ తదితరులు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు, వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 | రమేష్, ACO - 9059115968
ఖమ్మం ఎస్. ఉపేందర్ - 99591 24151 | మధిర వి.బాబు - 98498 64638
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990 | సత్తుపల్లి వి. బాబు - 79979 58225
వైరా వి. రాందాస్ - 98898 81843 | టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బిజినెస్ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కోరిన స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్ - 99122 20600

రవికుమార్ - 99499 27792
ఎస్. జయరాజు - 96528 68642